కోల్‌కతా ఘటన దారుణం



కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యం దారుణం. మగవారితో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రాణాలు నిలిపే వైద్య రంగంలో మహిళల సేవలు అమూల్యమైనవి. ఇటువంటి వైద్య రంగంలో రాత్రి విధులు నిర్వర్తించే వైద్యురాలిపై హత్యాచారం అత్యంత అమానుషం. జిల్లా ఆస్పత్రి మొదలుకొని వైద్య రంగంలో పని చేసే సిబ్బంది రక్షణకు ప్రాధాన్యతనివ్వాలి. ఆస్పత్రులు, సెక్యూరిటీ సిబ్బంది సంఖ్యను పెంచాలి.

\- డాక్టర్ ప్రమోద, ల్యాప్రోస్కోపిక్ సర్జన్, కడప

భద్రత చర్యలు చేపట్టాలి



కోల్‌కతా వైద్య కళాశాలలో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన యావత్ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. అన్ని ఆస్పత్రుల్లో వైద్యులతో పాటు సిబ్బంది ప్రాణ రక్షణ, భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక పోలీసు ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి. నగరం, పట్టణాలకు దూరంగా ఉండేలా వైద్యశాలల్లో పని చేయాలంటే భయాందోళనలు నెలకొన్నాయి. వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు అరికట్టేందుకు కఠిన చట్టాలు చేయాలి.

\- బి.ప్రతాప్ బృంగి, వైద్య నిపుణులు, కడప



నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జరిగిన ట్రెనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు బాధ్యులపై వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాత్రి పూట విధులు నిర్వర్తించే వైద్యులకు రక్షణ కల్పించాలి. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా పెద్దాస్పత్రిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి వైద్యులకు పూర్తి రక్షణ కల్పించాలి.

\- కె.చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య నిపుణులు, కడప

రక్షణ కల్పించాలి



వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది. వైద్య సిబ్బందికి విధి నిర్వహణలో రక్షణ కల్పించాలి. ప్రత్యేకంగా మహిళా సిబ్బంది రక్షణకు చర్యలు తీసుకోవాలి. వైద్యులు, వైద్య సిబ్బంది అంటే దైవంతో సమానమని గుర్తించాలి. అలా కాకుండా వైద్య సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తే విధి నిర్వహణలో ఉన్న వారికి ఇబ్బందిగా మారుతుంది.

\- అబ్బరాజు సుప్రజ, స్టాఫ్‌నర్స్, కడప

క్లుప్తంగా

'ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు అక్రమ అడ్మిషన్లు నిర్వహించాయని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్ యూనియన్ (ఏఐఎస్‌యూ) నాయకులు కోరారు. మంగళవారం వైవీయూలో వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ పలు కళాశాలల్లో ప్రవేశాల సమయంలో రెట్టింపు స్థాయిలో ఫీజుల వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

'రామాయణం' చక్కని మార్గదర్శి



ప్రసంగిస్తున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డి

కడప కల్చరల్ : నేటి సమాజానికి రామాయణం చక్కని మార్గదర్శిగా నిలుస్తోందని డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హిందూ ధర్మప్రచార పరిషత్, కడపశాఖ తరఫున టీటీడీ సూపరింటెండెంట్ ఢిల్లీరెడ్డి, ప్రోగ్రాం అసిస్టెంట్ గోపీబాబు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ధార్మిక ప్రసంగాల్లో భాగంగా స్థానిక విశ్వనాథపురంలో గల శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో వాల్మీకి రామాయణం సమకాలీన సమాజం అంశంపై డాక్టర్ శివారెడ్డి ప్రసంగించారు. రామాయణం అన్ని కాలాలకు దిక్సూచి లాంటిదని, సమాజం ఎంత ఆదర్శంగా ఉండాలో అందులో చూడవచ్చన్నారు. నేటి మానవ సంబంధాలన్నీ ఎలా వక్రమార్గం పడుతున్నాయో తెలుసుకునేందుకు రామాయణాన్ని పోల్చుకుని చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయస్వామి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరస్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఐకి పదోన్నతి

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ ఎస్ఐగా పని చేస్తున్న రంగస్వామికి సీఐగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కి చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో విధులను నిర్వహించారు. ప్రస్తుతం ఆయన కడప ఒన్‌టౌన్‌లో ఎస్ఐగా విధులను నిర్వహిస్తున్నారు. రాయలసీమ జోన్ పరిధిలో ఏడుగురు ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి లభించింది.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

వైవీయూ : జిల్లాలో ఈనెల 30వ తేదీ నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎఫ్ఓ వీవీ సందీప్‌రెడ్డి విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిసి కోరారు. యోగి వేమన విశ్వవిద్యాలయం కేంద్రంగా జిల్లా కలెక్టర్, జిల్లా అధికార యంత్రాంగం హాజరయ్యే ఈ కార్యక్రమంలో రెండువేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాన్ని, సమావేశ నిర్వహణకు అనువైన సమావేశ మందిరాన్ని డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, వీసీ ఆచార్యకే కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి, ఆచార్య మధుసూదన్ రెడ్డి, ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి, సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానందలు పరిశీలించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వీరి వెంట అటవీ శాఖ కడప రేంజ్ ఆఫీసర్ ప్రసాద్, వేంపల్లి రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యం అందిపుచ్చుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : విద్యార్థినులు చదువుతోపాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. కళాశాలలో బెంగళూరుకు చెందిన యునెక్స్ ఉన్నతి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థినులకు నెలరోజుల పాటు సాఫ్ట్‌స్కిల్స్‌పై శిక్షణ అందించారు. మంగళవారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థిదశలోనే ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.గురివిరెడ్డి, జేకేసీ ప్రతినిధి వరప్రసాద్, యునెక్స్ ట్రైనర్ సౌజన్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా



అహోబిలమఠం ఆలయంలో స్వామికి వటపత్రశాయి అలంకారం



పూజలకు హాజరైన భక్తులు, చిన్నికృష్ణయ్యలు

కడప కల్చరల్ : శ్రీకృష్ణ జయంతి వేడుకలు వైభవంగా ముగిశాయి. సోమవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష అభిషేకాలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కడప నగరం మోచంపేటలోని శ్రీ అహోబిళమఠంలోగల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి సుప్రభాత సేవ, విశేష అలంకారం నిర్వహించారు. అనంతరం స్వామిని వటపత్రశాయిగా అలంకరించి ఊంజల సేవ నిర్వహించారు. ఊయల వద్ద రాధికలు, గోపెమ్మల వేషధారణలో చిన్నారులు, పెద్దలు సామూహికంగా కోలాటం తదితర నృత్యాలను ప్రదర్శించారు. విష్ణు సహస్రనామ పారాయణం, భగవత్ ఆరాధన, అర్చనలు నిర్వహించారు.

సందడే సందడి

ఈ సందర్భంగా మూడు సంవత్సరాల నుంచి ఎనిమిది సంవత్సరాలలోపు చిన్నారులకు చిన్నికృష్ణయ్య వేషధారణల పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రులు పోటాపోటీగా తమ పిల్లలకు చిన్నికృష్ణుని వేషం వేయించి ముద్దులొలుకుతున్న తమ చిన్నారులను ఆలయానికి తీసుకొచ్చారు. హాజరైన చిన్నారులందరూ ముద్దులొలికే చిన్ని కన్నయ్యలుగా కనువిందు చేశారు. నిర్వాహకులు వారందరికీ చిన్నచిన్న కానుకలను అందించి ఆశీర్వదించారు. చివరగా భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

■ స్థానిక ద్వారకానగర్‌లోని శ్రీమురళీకృష్ణాలయంలో రెండవ రోజు మంగళవారం కూడా కృష్ణాష్టమి వేడుకలు కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామికి విశేష అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు.

మేయర్ ఇంటి వద్ద చెత్త వేయడం తగదు

- చెప్పుడు మాటలు విని ఇలాంటివి చేస్తున్న ఎమ్మెల్యే
- ఘర్షణ వాతావరణం వద్దు
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప మేయర్ ఇంటి వద్ద ఎమ్మెల్యే మాధవిరెడ్డి అనుచరవర్గం చెత్త వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మల్లికార్జున, పాకా సురేష్ తదితరులు అన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్త పన్ను రద్దు చేస్తామని చెప్పడం వల్ల ప్రజలెవరూ యూజర్ చార్జీలు చెల్లించడం లేదన్నారు. దీనివల్ల క్లాప్ ప్రోగ్రాం నిర్వహణ కార్పొరేషన్‌కు తలకు మించిన భారంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో క్లాప్ వాహనాలు ఆపినప్పటికీ.. కడపలో మాత్రం 70 వాహనాలు నడుపుతున్నామన్నారు. ఫలితంగా కడపలో ఎక్కడా చెత్త పేరుకున్న దాఖలాలు లేవని, ప్రజలెవరూ ఫిర్యాదులు కూడా చేయడం లేదన్నారు. ఎమ్మెల్యేను ప్రజల్లో చులకన చేసి పబ్బం గడుపుకోవాలన్న ఆలోచన తమకు లేదన్నారు. అలా ఉంటే ఆమె కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి హాజరైనప్పుడు తాము ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు చెప్పేవారం కాదన్నారు. ఎమ్మెల్యే మాధవి చెప్పుడు మాటలు విని రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న నగరంలో ఘర్షణ వాతావరణం ఏర్పరచడం సమంజసం కాదన్నారు. చెత్త ఎత్తడం లేదని ప్రజలెవరైనా ఫిర్యాదు చేసి ఉంటే కార్పొరేటర్లమంతా బహిరంగ క్షమాపణ చెప్పేందుకు సిద్ధమన్నారు. క్లాప్ ప్రోగ్రాం ద్వారా ప్రజలపై నామమాత్రపు యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నామని, టీడీపీ ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేయవద్దని చెప్పిందే తప్పా జీవో ఇవ్వలేదన్నారు. 2026 వరకూ తమ పాలకవర్గం ఉంటుందని, ప్రతి వీధిలో తాము చెత్త సేకరణ చేస్తామన్నారు. ఒక్కో చెత్త ఆటోకు రూ.1.08 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎం.రామలక్ష్మణ్‌రెడ్డి, చెన్నయ్య, చంద్రహాసరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జిలు కె. రాజశేఖర్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్, బండి ప్రసాద్, త్యాగరాజు, కిరణ్, అక్బర్, భాస్కర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర అన్నారు. ఈ విషయమై మంగళవారం కడపకు వచ్చిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపిన యూపీఎస్‌లో ఉద్యోగుల జీతంలో నుంచి నెలవారి నుంచి 10 శాతం, కేంద్ర వాటా 18.5 శాతం ప్రాన్ అకౌంట్‌లో క్రెడిట్ అయ్యే విధంగా ఆమోదం తెలిపారన్నారు. ఉద్యోగుల జీతం నుంచి కాంట్రిబ్యూషన్ లేకుండా వచ్చే పెన్షన్‌ను మాత్రమే కోరుతున్నామన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్‌ను మాత్రమే ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఎస్టీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా గౌరవాధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు ఉన్నారు.

ఇన్‌చార్జి వీసీని పదవి నుంచి తొలగించండి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని వీసీ పదవి నుంచి తొలగించాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం పులివెందులలో పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. శివశంకర్‌లు మాట్లాడుతూ గతంలో వైవీయూ ప్రిన్సిపాల్‌గా, కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో ఆయన చేసిన అవినీతి, లైంగిక ఆరోపణలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

కడప రూరల్ : దోమల నిర్మూలనకు అన్ని రకాలుగా చర్యలు చేపడుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు తెలిపారు. ప్రతి గృహాన్ని సందర్శించి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ కాలువల్లో పూడుకుపోయిన చెత్తను తొలగించి డ్రైనేజీ నీటిని ఎప్పటికప్పుడు పారే విధంగా చర్యలు చేపట్టామన్నారు. దోమల లార్వా నియంత్రణకు అబేట్ మందును పిచికారీ చేశామని తెలిపారు. వీధుల్లో బ్లీచింగ్, సున్నం మిశ్రమాన్ని చల్లామన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : హైదరాబాద్‌లోని ఏజే ఫంక్షన్ హాల్ బాలాపూర్ ఎక్స్ రోడ్‌లో టైగర్ షోటోఖాన్ నిర్వహించిన ఓపెన్ నేషనల్ కరాటే చాన్స్ చాంపియన్ షిప్‌లో కడప రాజారెడ్డివీధి బ్రాంచ్‌కి చెందిన నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు ఒక గోల్డ్ మెడల్, 9 సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులకు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8, 9 ఏళ్ల బాలికల విభాగంలో లాస్య గోల్డ్ మెడల్, బాలుర విభాగంలో సోనుపవన్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 9, 10 బాలుర విభాగంలో వెంకట్ చేతన్, అయాన్‌లు స్విలర్ మెడల్స్ వశం చేసుకున్నట్లు చెప్పారు. 10 నుంచి 13 ఏళ్ల విభాగంలో వెంకటసందీప్, అయాన్, సోమశేఖర్‌రెడ్డి, మహేంద్ర, అబ్దుల్ రెహమాన్, ఫోజన్‌లు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులు, కోచ్ విజయ్‌ను ఏజీఎం చెన్నకేశవరాజు, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఏవో హేమంత్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి అభినందించారు

వైవీయూలో నేటి నుంచి ఆర్ట్ ఎగ్జిబిషన్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ శాఖ పూర్వ విద్యార్థుల (2010–2024) ఆధ్వర్యంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 5వ వరకు కామర్స్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు తెలిపారు. ఆర్ట్ ఎగ్జిబిషన్ సంబంధించిన పోస్టర్లను విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి, ఆర్ట్స్ విభాగ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, కంట్రోలర్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి, ఫైన్ ఆర్ట్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కోటా మృత్యుంజయరావు, డాక్టర్ రమేష్ ఆవిష్కరించారు. చిత్రకళ, ప్రింట్ మేకింగ్, శిల్పకళ, డిజైన్‌ల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 30 మంది పూర్వ విద్యార్థులు కళను ప్రదర్శిస్తారన్నారు. ఈ ప్రదర్శనకు విద్యార్థులు, ప్రజలందరూ ఆహ్వానితులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైన్‌ఆర్ట్స్ శాఖ అధ్యాపకులు సీహెచ్ వెంకటేష్, చిన్నరాయుడు, బి.ఈరప్ప, డాక్టర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, వైవీయూ ఆలుమ్నీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ టి.సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు పాల్గొన్నారు.

వంక పొరంబోకు స్థల ఆక్రమణపై సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

కడప కార్పొరేషన్ : కడప నగరం చిన్నచౌకులో వంక పొరంబోకు స్థల ఆక్రమణపై రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. వంకపొరంబోకు స్థలాన్ని ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఇటీవల అఖిలపక్ష నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు చిన్నచౌక్‌లోని సర్వే నంబర్ 247లోని స్థలాన్ని సర్వే చేశారు. అధికారులతోపాటు ఈ సర్వేలో అఖిపలక్ష నాయకులు బి. నారాయణ రెడ్డి, కిషోర్ బూసిపాటి, సీఆర్‌వీ ప్రసాద్, ఆంజనేయులు, గుర్రప్ప, క్రిష్ణ, శివరాం తదితరులు పాల్గొన్నారు. వంక పొరంబోకు స్థలాన్ని 30 అడుగుల మేర అక్రమించి ఓ అపార్ట్‌మెంట్‌కు రహదారి వేసినట్లు అధికారులు గుర్తించారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. అఖిలపక్ష నాయకులు నారాయణరెడ్డి, కిశోర్ బూసిపాటి మాట్లాడుతూ గతంలో పేదలకు ఇచ్చిన స్థలాన్ని ఇలా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వంక పోరంబోకు స్థలాలను ఆక్రమించి యథేచ్ఛగా అపార్ట్‌మెంట్లు నిర్మించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు దీనికి ఎలా అనుమతి ఇచ్చారో తేల్చాలని, ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం ఈ స్థలాన్ని అధికారులు స్వాధీనపరచుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో హరికిరణ్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఈ స్థలాన్ని పేదలకు ఇచ్చేందుకు అంగీకరించడం జరిగిందని, తక్షణం ఈ ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీన పరుచుకుని పేదలకు పంచాలన్నారు.

వ్యాయామంతో మెరుగైన ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

కడప రూరల్ : వ్యాయామంతో మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో ఫిట్ ఇండియా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శరీరం ఫిట్‌నెస్‌గా ఉండాలంటే రోజూ అర గంట నుంచి గంటపాటు వ్యాయామం లేదా సైక్లింగ్ చేయాలన్నారు. దీనివల్ల మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, డాక్టర్ రమేష్, శ్రీదేవి, మనోరమ, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'క్రీడాదినోత్సవ' పోటీలు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవ సంబరాల్లో భాగంగా ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి.సలీంబాషా, ఫిజికల్ డైరెక్టర్ కె. మదన్‌మోహన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ అమలు చేయాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న వైవీయూ అకడమిక్ కన్సల్టెంట్లు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని అకడమిక్ కన్సల్టెంట్స్ ప్రతినిధులు పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని కడప ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కలిసి సమస్యలు విన్నవించారు. పీజీ, సెట్, నెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి అతి తక్కువ వేతనాలతో విద్యాలయంలో పని చేస్తున్న తమకు మినిమం టైంస్కేల్ (ఎంటీఎస్) అమలు చేసేలా చూడాలని కోరారు. 2019లో ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశ్వవిద్యాలయాలలో పనిచేసే అకడమిక్ కన్సల్టెంట్‌లకు ఎంటీఎస్ అమలు చేసేందుకు సి.బి.ఎస్. వెంకటరమణ పేరుతో కమిటీ నియమించి అమలు దశలో ఎన్నికలు రావడంతో అర్ధాంతరంగా ఆ ప్రక్రియ ఆగిపోయిందని తెలిపారు. ఎంఎల్‌సీని కలిసిన వారిలో వైవీయూ అకడమిక్ కన్సల్టెంట్ ప్రతినిధులు అనిల్ కుమార్, డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, డా.బి. బాలాజీ నాయక్, డాక్టర్ ఎస్, ఖాజాపీర్, కె. రెడ్డిశేఖర్ రెడ్డి, డా.వెంకటరమణ, ఎస్.సర్దార్ ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన వైవీయూ వీసీ

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి మంగళవారం సాయంత్రం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయానికి సంబంధించిన సమాచార బ్రోచర్లను అందజేశారు. విశ్వవిద్యాలయ అవసరాలను ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు.

సేవా భావం.. స్ఫూర్తిదాయకం



నిరాశ్రయులు వసతి గృహంలో దోమతెరలు పంపిణీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టిన సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీం ఆధ్వర్యంలో భారీ కేక్ తెచ్చి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆ తర్వాత 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరూన్ గ్రూప్ ఎండీ అహ్మద్‌బాషా, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో..

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత రామగోవిందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పాకా సురేష్ కుమార్, కరిముల్లా, పస్తం అంజి, సీహెచ్ సునీల్ కుమార్, సుబ్బరాయుడు, కంచుపాటి బాబు, త్యాగరాజు, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, క్రిష్ణవేణి, నారాయణమ్మ, బి.మరియలు పాల్గొన్నారు.

ప్రేమాలయ నిరాశ్రయుల కేంద్రంలో..

కడప నగరం జెడ్పీ ఆవరణలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో పులివెందుల నియోజకవర్గం సర్పంచుల సంఘం అధ్యక్షులు, కుమారుని కాల్వ పంచాయతీ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నిరాశ్రయులకు పంచిపెట్టారు. అనంతరం వారికి దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యాంసన్, మైనార్టీ నాయకులు షఫీ, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న మేయర్ సురేష్‌బాబు



అన్నదానం చేస్తున్న షఫీవుల్లా

కడప నగరం జిల్లా పరిషత్ ఆవరణలోని ప్రేమాలయ వసతి గృహంలో వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీం ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కడప మేయర్ కె.సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాసట చిల్డ్రన్స్ హోమ్‌లో..

కడప నగరం ఎన్‌జీవో కాలనీలోని బాసట చిల్డ్రన్స్ హోంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీవుల్లా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు కుమార్, మురళీ, రఘు పాల్గొన్నారు.

'సన్నపురెడ్డి'కి 'కేతు' స్మారక పురస్కారం

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన ప్రముఖ కథ, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డికి సీనియర్ కథకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి స్మారక పురస్కారాన్ని అందజేస్తున్నామని కవిత విద్యా సాంస్కృతిక సేవా అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన స్వగృహంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సన్నపురెడ్డి రచయితగా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారని, పలు పత్రికలు కూడా ఆయనకు బహుమతులను అందించాయని తెలిపారు. సాహిత్య సంస్థల నుంచి కూడా ఆయన ఎన్నో బహుమతులు అందుకున్నారని వివరించారు. ఆచార్యకేతు విశ్వనాథరెడ్డిపై తనకెంతో గౌరవాభిమానాలు ఉన్నాయని, ఇటీవల ఆయన కన్నుమూసిన వెంటనే ఆయన పేరిట జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించామన్నారు. నవంబరులో ఈ పురస్కారాన్ని కడప నగరంలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్, దుర్గాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐవోకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

కడప ఎడ్యుకేషన్ : ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు– నేడు పనులలో ప్రభుత్వ సొమ్ము కాజేసిన ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం ఇంటర్మీడియెట్ డీవీఈవో వెంకటసుబ్బయ్యను కడపలోని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం నాడు– నేడు పనుల కోసం కోటి 15 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసిందన్నారు. కానీ అక్కడ పూర్తి స్థాయిలో పనులు జరగలేదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇంత వరకు 53 లక్షలు వచ్చిందని, ఇంకా మిగతా బకాయి రావాల్సి ఉందని తెలిపారన్నారు.